DD9 వార్త
తెలుగు దినపత్రిక
శనివారం, నవంబర్ 8, 2025



## భద్రాద్రిలో దేశభక్తి పారవశ్యం

- 'వందేమాతరం' స్ఫూర్తితో పులకించిన భద్రాద్రి పుణ్యక్షేత్రం!
- వందేమాతరం గీతానికి 150 ఏళ్లు
- ఆలయం నుండి ఆసుపత్రి వరకు జాతీయ గీతాలాపన

10 లో

## లొంగిపోనున్న ఏడుగురు మావోయిస్టులు

చత్తీస్ గడ్ లో ఆయుధాలతో సహా లొంగుబాటు!

6 లో

## లోపించిన పారిశుధ్యం రోగాల బారిన జనం

- మున్సిపల్ అధికారులుకు ప్రజల ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన..
- పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్న మణుగూరు బస్తి

7 లో

# ప్రజల మనోభావాలకు గాయం

### గ్రామ దేవుళ్ల పై అధికారుల అత్యుత్సాహం





- నిరాధరన పేరిట నిరంకుశం..
- లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, మునిసిపల్ అధికారుల నిర్వాకం
- చర్యలుంటాయని ప్రకటించిన అధికార పార్టీ నేతలు
- గుడుల కూల్చివేతపై ఆగ్రహజ్వాలలు
- 46 దారి మైసమ్మ గుళ్ళ తొలగింపు
- పలు పక్షాల నిరసనలు
- అధికారుల తొందరపాటు నిర్ణయం : మహంకాళి స్వామి

ప్రజల సంస్కృతి పరిరక్షించి శాంతియుత వాతావరణం లో ప్రజానుకూల పాలన అందించాల్సిన అధికారులే ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. ప్రజల సంస్కృతి జీవనం లో భాగమైన సున్నిత అంశాల పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసేలా ప్రవర్తిస్తున్నారు. ఇందుకు రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మైసమ్మ గుడుల కూల్చివేతనే ప్రత్యేక్ష్య సాక్ష్యం. ఒకటి కాదు రెండు కాదు 46కి పైగా మైసమ్మ గ్రామ దేవతల గుడులు మున్సిపల్ అధికారులు కూల్చివేసారు .ప్రజల కోపం ఆవేశం, నిరసనలు తార స్థాయికి చేరుకున్నాయి. అధికారులు ఇచ్చిన వివరణ సైతం ప్రజా అసంతృప్తిని తగ్గించలేకపోయాయి.

- పెద్దపల్లి, (డిడి9 వార్త)

3 లో

## ఇసుక క్వారీల కోసం రగడ!

### రెండు సొసైటీ సభ్యుల మధ్య వైరం

- మంత్రి అండతో గుత్తేదారులు ఇష్టారాజ్యం
- గుత్తేదారుల కనుసన్నలతో ఒక సొసైటికే కొమ్ముకాస్తున్న అధికారులు
- న్యాయం చేయాలని కె.కొండాపురం గ్రామానికి చెందిన శ్రీ సీతారామ సొసైటీ సభ్యుల ఆందోళన
- కలెక్టరేట్ ఎదుట బైటాయించి నిరసన
- జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి.. తగిన చర్యలు తీసుకుంటామని హామీ

10 లో

## గుండ్ల సింగారం సొసైటీ రద్దు చేయాలి

- అసలైన బాధితులకు ఉపాధి హక్కులు కల్పించాలి
- బాధితులు పద్దం వీరయ్య



# ఎక్సైజ్ శాఖ తీరు మారేనా?

### సిండికేట్ వ్యవస్థను రూపుమాపుతోందా!

- అడ్డగోలు బెల్ట్ షాపులకు అనుమతులు ఇస్తుందా!
- వచ్చే ఏడాదైనా దోపిడీ వ్యవస్థను రూపుమాపుతుందా
- బినామీ వ్యాపారులు కోట్లు దండుకుంటుంటే మౌనం ఎందుకు
- ప్రతి ఏటా ఎక్సైజ్ శాఖ మౌనముని పాత్రనే పోషిస్తుంది
- అవినీతికి పాల్పడుతూ అక్రమ వ్యాపారులకు వంత పాడుతుంది
- బెల్ట్ షాపులను నియంత్రించడంలో పూర్తిగా విఫలం

రాష్ట్ర ప్రభుత్వానికి లాభాలు తెచ్చిపెడుతున్న ఎక్సైజ్ శాఖ తీరు పేదోన్ని కొట్టి పెద్దలకు పెడుతున్న చందంగా ఉంది. తెలంగాణ స్టేట్ బేవరేజెస్ ఆఫ్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాల్సి ఉంటుంది. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇష్టానుసారంగా రహస్య గోదాములు పెట్టి బెల్టు షాపులకు అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతున్నారు. లక్షల్లో జీతాలు తీసుకుంటూ అవి చాలదన్నట్టుగా మద్యం వ్యాపారాలు చేసే దుకాణ దారుల నుండి నెలవారి మామూళ్ళు తీసుకుంటున్నట్లు ఆ శాఖపై ఆరోపణలు వెల్లడవుతున్నాయి. -భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, డీడీ 9 వార్త

2 లో



# ఎక్సైజ్ శాఖ తీరు మారేనా?

- సిండికేట్ వ్యవస్థను రూపుమాపుతోందా..!
- అడ్డగోలు బెల్ట్ షాపులకు అనుమతులు ఇస్తుందా.!
- వచ్చే ఏడాదైనా దోపిడీ వ్యవస్థను రూపుమాపుతుందా..
- బినామీ వ్యాపారులు కోట్లు దండుకుంటుంటే మౌనం ఎందుకు..
- ప్రతి ఏటా ఎక్సైజ్ శాఖ మౌనముని పాత్రనే పోషిస్తుంది..
- అవినీతికి పాల్పడుతూ అక్రమ వ్యాపారులకు వంత పాడుతుంది..
- బెల్ట్ షాపులను నియంత్రించడంలో పూర్తిగా విఫలం..

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, డీడీ 9 వార్త:** రాష్ట్ర ప్రభుత్వానికి లాభాలు తెచ్చిపెడుతున్న ఎక్సైజ్ శాఖ తీరు పేదోన్ని కొట్టి పెద్దలకు పెడుతున్న చందంగా ఉంది. తెలంగాణ స్టేట్ బేవరేజెస్ ఆఫ్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాల్సి ఉంటుంది. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇష్టానుసారంగా రహస్య గోదాములు పెట్టి బెల్టు షాపులకు అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతూ ప్రజల్ని దోపిడీ చేస్తుంటే ఎక్సైజ్ శాఖ ఎవరి కోసం పని చేస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్షల్లో జీతాలు తీసుకుంటూ అవి చాలదన్నట్టుగా మద్యం వ్యాపారాలు చేసే దుకాణ దారుల నుండి నెలవారి మామూళ్ళు తీసుకుంటున్నట్లు ఆ శాఖపై ఆరోపణలు వెల్లడవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా రెండంకెల సంఖ్యలో మద్యం దుకాణాలు ఉన్నప్పటికీ కొన్ని వేల సంఖ్యలో బెల్టు షాపుల దందా కొనసాగుతుంది. వీటిలో ముఖ్యంగా కొన్ని గోదాములకే అనుమతులు ఉన్నాయి. కానీ కొందరు వ్యాపారస్తులు మద్యాన్ని అనుమతులు లేని గోదాముల్లో దాచేస్తూ అక్రమ వ్యాపారాలు చేస్తూ కోట్లు దండుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ దుకాణాలు నిబంధనల ప్రకారం పని చేస్తున్నాయా లేక అక్రమ మార్గంలో సంపాదించుకుంటున్నారా అనే విషయాల పై దృష్టి సారించాల్సిన అధికారులు వారి కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తించలేక పోతుండడం పట్ల కారణాలు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోట్లు ఖర్చుపెట్టి టెండర్లు దక్కించుకున్న వారంతా అక్రమ వ్యాపారాలు చేస్తూ కోట్లు కూడా పెట్టుకుంటూ మందుబాబుల జేబులను గుల్లా చేస్తుంటే ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు అరికట్టడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వారికి వస్తున్న నెల వారి మామూళ్లతో ఆస్తులు కూడా పెట్టుకుంటున్నారు తప్ప అరికట్టడంలో విఫలం అవుతున్నారని వాదన బలంగా వినిపిస్తోంది.

### అడ్డగోలుగా వెలుస్తున్న బెల్ట్ షాపులు

ఎక్సైస్ శాఖ నిబంధనలో ప్రధానమైనవి మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం కలిగించడం, అక్రమ మద్యం ఉత్పత్తి వాటి అక్రమ రవాణా నిరోధించడం ముఖ్యమైనవి. ఈ నిబంధనలను ఆ శాఖ అధికారులు తుంగలో తొక్కి బెల్టు షాపులను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలుస్తోంది. గల్లి గల్లి కో బెల్ట్ షాపు వెలియడంతో సందు, సందుకు మందు అందుబాటులోకి వచ్చిం ది. జిల్లా వ్యాప్తంగా కొన్ని వేల బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. వైన్ షాపులకు అనుబంధంగా వేలల్లో బెల్ట్ షాపులు వెలిసాయి. వీటన్నిటికీ మద్యాన్ని సిండికేట్ వ్యాపారస్తులు రహస్య గోదా ముల్లో నుంచి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. దీంతో బెల్ట్ షాపుల వ్యాపారం మూడు ఫుల్ బాటిల్ ఆరు క్వార్టర్ల లాగా మారిపోయింది. గోదాముల్లో ఒక్క క్వార్టర్ కు 20 రూపాయలకు అదనంగా చెల్లించి విక్రయిస్తున్న వ్యాపారులు బెల్ట్ షాపుల్లో సమయాన్ని బట్టి అధిక ధరలకు అమ్ముతున్నారు. బెల్టు షాపుల నియంత్రణ లేకపోవడంతో ప్రతినిత్యం ఏదో ఓచోట అల్లరి మూకలు మద్యం సేవించి ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి ఆదాయమే కాక, వారి నిబంధనల ప్రకారం పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### సిండికేట్ వ్యవస్థకు వంత పాడుతున్న ఎక్సైజ్ శాఖ

అంతా ఒక్కటై జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో మద్యం వ్యాపారులు మందుబాబులను దోచుకునే పనిలో పడ్డారు. లెక్కలు కట్టే మరి ఎక్కడినుండి ఎంత వసూలు చేయాలనే ఆలోచన చేస్తూ ప్రతి ఏటా కోట్ల రూపాయల అక్రమ సంపాదనను వెనకేసుకుంటున్నారు. మద్యం దుకాణాల అనుమతులు పొందిన వ్యాపారులంతా సిండికేట్ వ్యవస్థను స్థాపించి ఎక్సైజ్ శాఖను శాసిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సుమారుగా అనుమతులు 100 షాపులకే వచ్చిన వాటికి భాగస్వామ్యులు మాత్రం వేలాల్లో ఉన్నారు. వీరంతా ఒక్కటై సంబంధిత అధికారులతో చీకటి ఒప్పందాలు చేసుకొని వారి సిండికేట్ సామ్రాజ్యాన్ని విస్తరింపచేస్తున్నారు. మళ్లీ వచ్చే మద్యం వేలం పాటల వరకు ఇప్పటి నుండే బ్లాక్ మనీ సంపాదిస్తూ కోట్లలో కూడా పెట్టుకుంటున్నారని తెలుస్తోంది. ఇందులో ప్రతి ఒక్కరికి వాటాలు ఇస్తున్నామని చెప్పుకొస్తున్న బినామీ వ్యాపారులు ఎవరికి ఏ వాటా ఇవ్వకుండా నిబంధనల ప్రకారం వ్యాపారాలు ఎందుకు నిర్వర్తించలేకపోతున్నారు అనేది ప్రశ్నార్ధకంగా మిగిలింది. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో నిబంధనల ప్రకారం మద్యం వ్యాపారాలు జరుగుతున్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే ఈ తరహాపు దందా కొనసాగడం విశేషం. దీంతో ఎక్సైజ్ శాఖ ఎవరికోసం పనిచేస్తుందని ప్రశ్న తలెత్తుతుంది. ఈసారి అయినా నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహిస్తారా లేక పాత పద్ధతిని వ్యాపారస్తులు పాటిస్తున్న వారికి వంత పాడుతారా అనేది వేచి చూడాలి.

# గుండ్ల సింగారం సొసైటీ రద్దు చేయాలి

- అసలైన బాధితులకు ఉపాధి హక్కులు కల్పించాలి
- బాధితులు పద్దం వీరయ్య

**మణుగూరు,నవంబర్ 7 (డిడి9 వార్త):** గుండ్లసింగారం ఇసుక సొసైటీ అనుమతులు రద్దు చేసి అసలైన గిరిజన భూసేకరణ భాదితులకు ఉపాధి హక్కులు కల్పించాలని కోరుతూ బాధితుల్లో ఒకరైన పద్దం వీరయ్య జిల్లా కలెక్టర్, భద్రాచలం ఐటీడీఏ పిఓ,టీజిఎండీసి పిఓ, టీజిఎండిసి ఎండిలకు ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని గుండ్లసింగారం రెవిన్యూ గ్రామంలో ఏర్పాటైన వారాహీ ఇసుక సొసైటీపై స్థానిక గిరిజన భూమి నిర్వాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు గుడ్ల సింగారం రెవిన్యూ గ్రామ పరిధిలోని గిరిజనులకు చెందిన సుమారు 200 ఎకరాల భూమిని మరియు 70 కుటుంబాలకు చెందిన నివాస గృహములను దేశ అభివృద్ధి కోసం, మణుగూరు ఓసి విస్తరణలో భాగంగా 2016 లో ప్రభుత్వానికి అప్పగించి భూసేకరణకి సహకరించినట్లుగా తెలిపారు. అప్పటి నుండి స్తానికంగా ఉన్న జీవన ఉపాధి మార్గాల ద్వార వారు జీవనం సాగిస్తున్నట్లు,ఇటివల గుండ్లసింగారం గ్రామం పేరుతో వారాహీ ఇసుక సొసైటీ ఏర్పాటు చేసుకున్న బాపనకుంట గ్రామస్తులకు గుండ్ల సింగారం గ్రామంలోని ఇసుకను కేటాయించటం పై ఆగ్రహం వ్యక్తంచేశారు . వాస్తవానికి గుండ్లసింగారం గ్రామంలోని భూముల పై పూర్తి హక్కులు అక్కడ భూములు త్యాగం చేసిన వారికి మాత్రమే ఉన్నవని అన్నారు.ఇసుక మేటలను తొలగించే ఉపాధి అవకాశాలు గుండ్ల సింగారం రెవిన్యూ గ్రామాలకు చెందిన భూనిర్వాసితులకు అవకాశం కల్పించకుండా అధికారులు దుర్వినియోగానికి పాల్పడి బాపనకుంట గ్రామస్తులకు సుమారు 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీయుటకు అనుమతులు ఎలా ఇచ్చినారు అని ప్రశ్నించారు. అసలు ఈ సొసైటీ 2025 జూన్ నెలలో ఏర్పడగానే నెలలు కూడా పూర్తి కాకుండానే మొదటిసారిగ ఇంత పెద్ద మొత్తంలో అనుమతులు ఇవ్వటం వెనుక ఎంత మంది బడా బాబులు ఉన్నారనే విషయం ఇట్టే తెలిసిపోతుంది అన్నారు అసలు భూనిర్వాసితులకు హక్కులు ఉండగా ఇసుక వెలికి తీసే అనుమతులు వేరే గ్రామస్తులకు ఇవ్వడాన్ని తప్పు పట్టారు, నివేదిక పై సమగ్ర విచారణ జరిపించి అసలైన హక్కుదారులైనా న్యూపద్మగూడెం గ్రామ భూ నిర్వసితులకు మాత్రమే గుండ్లసింగారం రెవిన్యూ గ్రామంలో ఇసుక వెలికి తీసే హక్కులు కల్పించాలని అన్నారు. గుండ్లసింగారం పేరుతో వారాహీ ఇసుక సొసైటీకి ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయ్యలని, దీనికి సహకరించిన అధికారుల పై చట్ట రీత్యా చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు.

# ప్రజల మనోభావాలకు గాయం

## గ్రామ దేవుళ్ల పై అధికారుల అత్యుత్సాహం



- నిరాధరన పేరిట నిరంకుశం..
- లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, మునిసిపల్ అధికారుల నిర్వాకం
- చర్యలుంటాయని ప్రకటించిన అధికార పార్టీ నేతలు
- గుడుల కూల్చివేతపై ఆగ్రహజ్వాలలు
- 46 దారి మైసమ్మ గుళ్ళ తొలగింపు
- పలు పక్షాల నిరసనలు
- అధికారుల తొందరపాటు నిర్ణయం : మహంకాళి స్వామి





**పెద్దపల్లి, నవంబర్ 07 (డిడి9 వార్త):** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని పలు కూడల్లు , రోడ్ లో ఉన్న దారి మైసమ్మ , పోచమ్మ , ఎల్లమ్మ, వెల్పమ్మ గుడులను మున్సిపల్ అధికారులు రాత్రి రాత్రికి తొలగించారు. తొలగించిన గుడుల ప్రాంతం లో శూలాలు వాటి ఆనవాళ్లు తొలగించకుండా పడవేశారు. అమ్మవారి ప్రతిమలు చెల్ల చెదురుగా పడవేసారు. ఎవరో దుండగుల పని అని భావించిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసి నిరసనలు చేశారు. మున్సిపల్ అధికారులు వివరణ ఇస్తూ సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ను అనుసరించి తామే కూల్చివేశామని వివరణ ఇచ్చారు. అధికారులు ఇచిన వివరణ కూడా ప్రజలను మరింత కోపోద్రేహులకు కారణం అయ్యింది . మైసమ్మ గుడులు మలమూత్ర విసర్జితలలో అపవిత్రం అవుతున్నాయనే వివరణ ప్రజలను శాంతింపచేయలేకపోయింది. ఈ కూల్చివేతలను స్థానికులు పలు పలు పక్షాలు, మాజీ ఎమ్మెల్యే చందర్, సీనియర్ నాయకులు కౌశిక హరి ,బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి ఖండించారు.

### ముందస్తు సమాచారం ఏది...

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆధారాలతో సందర్భోచితంగా పూజలు చేపట్టి మిగతా సమయాల్లో గుడులను అపవిత్రం చేస్తున్నారనే కారణంతో అధికారులు వివరణ ఇచ్చారు. గుడుల కూల్చివేత సున్నితమైన అంశం అయినప్పటికీ ప్రజల ఆవేశం భవిష్య పరిణామాలు అంచనా వేయకుండా అవగాహన రాహిత్యంగా ప్రవర్తించారు, అన్ని ప్రభుత్వ శాఖల అభిప్రాయంతో జాయింట్ యాక్షన్ గా తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలకు వివరించడంలో విఫలమయ్యారు. ఇట్టి విషయాన్ని మరుగున పెట్టి రాత్రికి రాత్రి గుడులను కూలగొట్టి ప్రజల మనోభావాలు దెబ్బ తినేలా ప్రవర్తించారు.





### ఔరంగజేబు పాలన నడుస్తుంది: కందుల సంధ్యారాణి



ఇక్కడ ఔరంగజేబు పాలన నడుస్తుంది.. మైసమ్మ గుడుల కూల్చివేత హిందూ ప్రజల విశ్వాసాలను కించపరిచింది.ప్రజలకు అధికారులు కచ్చితమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది .అధికార పాలకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

### రాత్రికి రాత్రి గుడులు కూల్చాల్సిన అవసరం ఏముంది: కొండపర్తి సంజీవ్ బీజేపీ నాయకులు



అర్ధరాత్రి చట్ట విరుద్ధంగా, మెజారిటీ హిందూ ప్రజలు మనోభావాలను దెబ్బతీస్తూ మైసమ్మ గుడులను కూల్చివేయడం హేయమైన చర్య . ప్రజల విశ్వాసాలను కాపాడాల్సిన అధికారులు అందుకు బిన్నంగా ప్రవర్తించారు. కూల్చివేతలు తప్పనిసరి ఐతే ముందస్తు నోటీసు ఇచ్చి ప్రజలకు సమాచారం అందించాలి.

### అధికారుల తొందరపాటు నిర్ణయం మహంకాళి స్వామి: మహంకాళి స్వామి సీనియర్ కాంగ్రెస్ నాయకులు



ఇది అధికారుల తొందరపాటు నిర్ణయం పాలక వర్గాల దృష్టికి రాకుండా అధికారులు చేసిన తప్పిదం. దీనిపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆగ్రహంతో ఉన్నారు, అధికారులు కూల్చివేసిన గుడుల స్థలంలో ఆలయాల పునప్రతిష్ట ప్రారంభించాం, ఇప్పటికే ప్రధాన కూడల్లో 3 గుడులను సొంత ఖర్చులతో పున ప్రతిష్ట చేశాము. ప్రతి డివిజన్లో రెండు గుంటల స్థలంలో శాశ్వతంగా ఉండే విధంగా ప్రజాభిషం మేరకు గుడులను కట్టించడానికి అధికార పార్టీ సిద్ధంగా ఉంది ఇట్టి విషయానికి అధికార పార్టీకి రాజకీయ రంగు పులమద్దు.

### తెలంగాణ సంస్కృతి పరిరక్షణకై పోరాడుతాము: కోరుకంటి చందర్ మాజీ ఎమ్మెల్యే



మైసమ్మ గుడుల కూల్చివేతకు కారకులైన వారి మీద చట్టపర చర్యలు తీసుకోవాలి.భక్తుల మనోభావాలకు ,వారి విశ్వాసాన్ని అవమానించేలా వ్యవహరించిన వారికి వ్యతిరేకం గా జరిగే పోరాటం లో పార్టీలకు అతీతంగా పాల్గొంటాము. తెలంగాణ సంస్కృతిని నాశనం చేసే కుట్రలు విరమించుకోవాలి . కూల్చివేసిన గుడుల నిర్మాణాలు వెంటనే చేపట్టాలి.

### ప్రజల మనోభావాలు దెబ్బతీశారు:కౌశిక హరి

గ్రామ దేవతలు అయినటువంటి దారి మైసమ్మ, వేల్పులమ్మ గుళ్ళు కూల్చివేసిన వారు మూర్ఖులు. ప్రజల మనోభావాలు దెబ్బతీశారు. ప్రజలు తిరగబడితే ఎలా ఉంటుందో చైతన్యవంతమైన ఈ ప్రాంత ప్రజలు నిరూపించారు . అధికారులకు పిర్యాదు చేసాము. రాజ్యాంగ బద్ధంగా పోరాడుతాము.





# గుడుంబా పట్టివేత

- ఏటూరునాగారంలో 20 లీటర్ల గుడుంబా పట్టివేత.

ఏటూర్ నాగారం నవంబర్ 07 (డిడి 9 వార్త)

ఏటూరునాగారం మండలం రోయ్యూరు గ్రామంలో అక్రమంగా గుడుంబా విక్రయాల జరుగుతున్నావని నమ్మకమైన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమాచారంపై ఎస్ఐ రాజ్ కుమార్ నేతృత్వంలో పోలీసులు రోయ్యూరు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, దొంగ్రి రాజశేఖర్ అనే వ్యక్తి గుడుంబా అమ్ముతున్నట్లు గుర్తించి, ఘటనాస్థలంలో నుంచే 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీ, విక్రయం పై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తామని ఎస్ఐ రాజ్కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య, కానిస్టేబుల్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం లో పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రారంభం

- ఆర్థిక విధానాల రూపకల్పనకు తాజా శ్రామిక గణాంకాలు అవసరం – జాతీయ గణాంక అధికారి

పెద్దపల్లి,నవంబర్ 7(డీడీ న్యూస్):

జాతీయ గణాంక కార్యాలయ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ గురువారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీని కలిసి నగరంలో జరుగుతున్న పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే పురోగతి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేగంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక అభివృద్ధి కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాజా శ్రామిక గణాంకాల అవసరం ఏర్పడిందని, అందుకే ఈ సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎంపిక చేసిన పట్టణాలలో రామగుండం కూడా ఒకటని, సర్వే ఇప్పటికే ప్రారంభమైందని చెప్పారు. మొదట సాధారణ వివరాలు సేకరించి, అనంతరం ప్రత్యేక ట్యాబ్ ద్వారా 12 కుటుంబాలను ఎంపిక చేసి వారి వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. ఇందులో కుటుంబ యజమాని పేరు, సభ్యుల వివరాలు, విద్యార్హతలు, వృత్తివిద్య, స్వయం ఉపాధి తదితర అంశాలు చేర్చుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర రావు పాల్గొన్నారు.



# అగ్రిమెంట్ చేసుకున్నాకే రైతులు మొక్కజొన్నను సాగు చేయాలి

- మండల వ్యవసాయ అధికారి. నవీన్.

నవంబర్ 7 డిడి 9 వార్త వెంకటాపురం (నూగూరు).



వెంకటాపురం మండల పరిధిలోని మొక్కజొన్న విత్తనోత్పత్తి చేయదలుచుకున్న రైతులు ఆర్గనైజర్/కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే రైతులు మొక్కజొన్న సాగు చేయాలని వెంకటాపురం మండలం వ్యవసాయ అధికారి నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో రైతులకు తెలియజేశారు... గత సంవత్సరం మొక్కజొన్న విత్తనోత్పత్తిలో తలెత్తిన సమస్యలు అనుభవాల దృష్ట్యా రైతులు మోసపోకుండా ముందస్తుగా అగ్రిమెంట్లు చేసుకున్న తర్వాతే మొక్కజొన్న పంట వేసుకోవాలని సూచించారు.... రైతులు కంపెనీ లేదా ఆర్గనైజర్ నుండి అగ్రిమెంట్ తీసుకోవడం తమ బాధ్యతగా భావించాలని సూచించారు.. రైతులు కంపెనీ లేదా ఆర్గనైజర్ నుండి విత్తనాలు ఎరువులు పురుగు మందులు తీసుకున్నప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, అగ్రిమెంట్ మరియు బిల్లులు వంటకాలు పూర్తయిపోయే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, పంట పెట్టుబడి కింద కంపెనీ లేదా ఆర్గనైజర్ ఇచ్చే డబ్బులు కేవలం బ్యాంక్ అకౌంట్ ద్వారానే జమ చేసుకోవాలని నగదు రూపంలో తీసుకోవద్దని రైతులకి తెలియజేశారు... పంట వేసుకున్న తర్వాత కంపెనీ తరఫున ఫీల్డ్ ఏజెంట్లు తప్పనిసరిగా పంటని తరచుగా పర్యవేక్షిస్తూ వ్యవసాయ పంటలో వచ్చే ఇబ్బందులని వ్యవసాయ శాఖ ద్వారా నివృత్తి చేసుకొని రైతులకు తగిన సలహాలు సూచనలు ఇచ్చి రైతులు అధిక దిగుబడులు పొందేలా చూడాలి అని అన్నారు... ఆర్గనైజర్లు సైతం రైతులకు అందించే ఎరువులు పురుగుమందులు అన్ని లైసెన్సుడు ఎరువులు పురుగు మందుల దుకాణం నుంచి అందజేయాలని ఆర్గనైజర్లకి వ్యవసాయ అధికారి సూచించారు..... కంపెనీ గాని ఆర్గనైజర్లు గాని రైతులకి అగ్రిమెంట్ ఇవ్వకుండా మొక్కజొన్న సాగు చేయించి రైతులకి నష్టం కలిగిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు... ఈ విషయమై వ్యవసాయ శాఖ నుండి వచ్చే సలహాలు సూచనలని రైతులు ఎప్పటికప్పుడు తప్పక పాటించాలని సూచించారు.






# కామారెడ్డి జిల్లా IDOC లో వందేమాతరం గేయాలాపన

కామారెడ్డి,నవంబర్ 06(డిడి9 వార్త) :

వందేమాతరం 150వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత జాతీయ గీతం "వందేమాతరం" రచయిత శ్రీ బంకిం చంద్ర చటర్జీ ఈ కీర్తి గీతాన్ని రచించిన సందర్భంగా, భారత ప్రభుత్వం ఆ ఘట్టాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో సామూహికంగా వందేమాతరం గేయాలాపన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కంప్లెక్స్ ప్రాంగణంలో అదనపు కలెక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని వందేమాతరం గేయాన్ని సమూహంగా ఆలపించారు. ఈ సందర్భంగా అధికారులంతా దేశభక్తి, ఐక్యత, స్ఫూర్తిని ప్రతిబింబించే ఈ గేయం భారత స్వాతంత్ర్య సమరంలో పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకున్నారు.

# జాతీయ గేయం 'వందేమాతరం'కి 150 ఏళ్లు

- రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా గీతాలాపన
- భారత గౌరవం, ఐక్యతకు ప్రతీక వందేమాతరం – పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి,నవంబర్ 07(డీడీ9 వార్త):



భారత జాతీయ గేయం 'వందేమాతరం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ లో శుక్రవారం దేశభక్తి గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, అధికారులు, సిబ్బందితో కలిసి వందేమాతరంను సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వందేమాతరం కేవలం గేయం మాత్రమే కాదు... భారత బానిసత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో జనజాగృతి తెచ్చిన ఉద్యమ గీతం అని అన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య సమరయోధులకు స్ఫూర్తినిచ్చిందని, మాతృభూమిని బలం, శ్రేయస్సు, దైవత్వానికి ప్రతీకగా నిలబెట్టిందని చెప్పారు. జాతీయ సమైక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ దేశానికి ప్రేరణగా నిలిచిందని గుర్తుచేశారు. దేశ గౌరవాన్ని కాపాడే ప్రతీ భారతీయుడు వందేమాతరం పట్ల గౌరవభావం కలిగి ఉండాలి. ఈ గీతం మన గర్వం, మన ఐక్యతకు చిహ్నం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామనమూర్తి, మల్లేశం, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, సందీప్, సంధ్య, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, సీసీపీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వందేమాతరం 150 ఏళ్లు – జాతీయ గీతంతో మార్మోగిన సెంటినరీ కాలనీ

- **300 మంది విద్యార్థులు గళమెత్తి పాడిన జాతీయ గీతం – బీజేపీ ఎంపీటీసీల ఫోరం ఆధ్వర్యంలో ప్రేరణాత్మక కార్యక్రమం**

**పెద్దపల్లి, నవంబర్ 7 (డీడీ9 వార్త):**

వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా సెంటినరీ కాలనీలో తెలంగాణ చౌరస్తా వద్ద దేశభక్తి ఉత్సాహంతో విద్యార్థులు జాతీయ గేయం ఆలపించారు. బీజేపీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రేరణాత్మక కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఏక స్వరంతో వందేమాతరం గీతం ఆలపించి దేశభక్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి హృదయంలో జాతీయ భావం నాటుకోవాలి. వందేమాతరం అంటే 'తల్లికి నమస్కారం'. ఈ గీతం స్ఫూర్తితోనే అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలు త్యాగం చేశారు. యువత ఈ స్ఫూర్తిని మనసులో పెట్టుకొని దేశ భవిష్యత్తును నిర్మించాలి, అని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రగతి విద్యాసంస్థ, వాణి సెకండరీ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేశభక్తి గీతాలతో వేదిక మార్మోగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ మేకల శరణ్యమారుతి, మాజీ జెడ్పిటీసీ గంట వెంకటరమణారెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ అబ్బో కేశవరెడ్డి, వాణి స్కూల్ పిటి తిరుపతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బార్ల శ్రీనివాస్, మెరుగు శ్రీకాంత్, రంజిత్, రవీందర్, దేవదాసు, కోటి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం దేశభక్తి స్ఫూర్తిని నింపుతూ విజయవంతంగా ముగిసింది.








# అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదాం !

- **సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంద) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి.**

**మణుగూరు నవంబర్ 7 డి డి 9 వార్త ( ప్రతినిధి) :**

అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదాం అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. నవంబర్ 1 నుండి 9 వరకు జరుగుతున్న అమరవీరుల సంస్మరణ సభల వారోత్సవాల్లో భాగంగా మణుగూరు లోని స్థానిక పార్టీ కార్యాలయంలో బత్తుల. వెంకటేశ్వర్లు అధ్యక్షతన అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో దోపిడీ, పీడనలు లేని సమ సమాజం కావాలని, ధనిక, పేద బేధం లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కలలు కని అందుకోసం తమ జీవితాలను త్యాగం చేసి ఎంతోమంది అమరవీరులయ్యారని అన్నారు. అమరులు ఏ ఆశయం కోసం అయితే పోరాడి అమరులయ్యారో ఆ ఆశయ సాధన కోసం మనమంతా పోరాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కాంపాటి పృథ్వీ, నాయకులు సంజీవరెడ్డి, జానయ్య, మిట్టపల్లి రాజేందర్ మల్లెల. రామయ్య జే. యాకయ్య, సతీష్, నరసింహారావు, రాజు, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

# పచ్చదనం మధ్యలో ఎన్టీపీసీ రామగుండం 51వ రైజింగ్ డే వేడుకలు

- **జాతీయ అభివృద్ధి పయనంలో ఐదున్నర దశాబ్దాల విశిష్ట ప్రయాణం – సస్టైనబిలిటీ పట్ల కట్టుబాటుతో ఘనంగా వేడుకలు**

**పెద్దపల్లి,నవంబర్ 07(డీడీ9 వార్త):**




ఎన్టీపీసీ రామగుండం లో 51వ రైజింగ్ డే వేడుకలు శుక్రవారం ఉత్సాహభరితంగా, పచ్చదనం పట్ల అంకితభావంతో నిర్వహించబడ్డాయి. జాతీయ శక్తి సంస్థగా దేశ అభివృద్ధికి ఐదున్నర దశాబ్దాలుగా ఎన్టీపీసీ చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ వేడుకలు పిటిఎస్ లోని కాకతీయ ఆడిటోరియం లాన్స్ వద్ద ఘనంగా జరిగాయి.

వేడుకలు ఉదయం ప్రత్యేక మాస్ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్తో ప్రారంభమయ్యాయి. హోప్/జీఎం నివాస సముదాయం సమీపంలో నిర్వహించిన ఈ మొక్కల నాటకం ద్వారా సంస్థ "హరిత భారత్ - సస్టైనబుల్ ఫ్యూచర్" దిశగా తన కట్టుబాటును మరోసారి ప్రదర్శించింది.

తరువాత ప్రధాన కార్యక్రమంలో చీఫ్ గెస్ట్‌గా హాజరైన చందన్ కుమార్ సామంత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ అండ్ టీ) జెండా ఆవిష్కరించి, రైజింగ్ డే కేక్ కటింగ్ మరియు బెలూన్ రిలీజ్ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, వివిధ యూనియన్లు మరియు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సామంత మాట్లాడుతూ... ఎన్టీపీసీ రామగుండం నిరంతర ప్రగతి, ఆవిష్కరణా దృక్పథం, పర్యావరణ పరిరక్షణ పట్ల కట్టుబాటు సంస్థ విజయానికి ఆధారం అని అన్నారు. ఐదు దశాబ్దాల ప్రయాణంలో ఎన్టీపీసీ పవర్ ఫర్ ఆల్ లక్ష్యాన్ని నిబద్ధతతో సాధిస్తున్నదని ప్రశంసించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. తరువాత ఎన్టీపీసీ సిఎమ్‌డీ గుర్దీప్ సింగ్ నోయిడా నుండి చేసిన కార్పొరేట్ రైజింగ్ డే అడ్రస్ను ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించారు.




# బంగారు పతకాలతో మెరిసిన సమత

- **శాతవాహన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో అరుదైన గౌరవం**
- **భర్త ప్రోత్సాహమే విజయ రహస్యం అంటున్న తెలుగు లెక్చరర్**

**పెద్దపల్లి, నవంబర్ 7 (డీడీ9 వార్త):**



చదువంటే మక్కువ... కష్టపడి నేర్చుకోవాలన్న తపన... కుటుంబం ప్రోత్సాహం —— ఇవన్నీ కలిస్తే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించారు ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ సముద్రాల సమత.

శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన తాజా స్నాతకోత్సవంలో సమత రెండు బంగారు పతకాలు అందుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు.

కరీంనగర్‌లోని శ్రీ రాజ రాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2016-18 విద్యా సంవత్సరంలో ఎం.ఏ తెలుగు చదివిన ఆమె, విశ్వవిద్యాలయం పరిధిలో అత్యధిక మార్కులు సాధించి ఒక బంగారు పతకం, వ్యాకరణం-భాషా చరిత్ర పేపర్‌లో టాపర్‌గా నిలిచి మరో బంగారు పతకం దక్కించుకున్నారు.

ఈ రెండు పతకాలను శాతవాహన విశ్వవిద్యాలయం చాన్సలర్, వైస్ చాన్సలర్ చేతుల మీదుగా స్వీకరించారు.

**అనంతరం సమత మాట్లాడుతూ...**

"డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే నా వివాహం జరిగింది. అయినప్పటికీ నా భర్త శ్రీ రమేష్ ఎప్పుడూ చదువు ఆపమని చెప్పలేదు. నన్ను ముందుకు నడిపిస్తూ ఎల్లప్పుడూ ప్రోత్సహించారు. ఆయన నాకు కందుకూరి వీరేశలింగం గారి లాంటి ప్రేరణా దాత" అని అన్నారు.


Satavahana University
Gold Medal Certificate
This is to certify that Samudrala Samatha Son/Daughter of S. Komuraiah has passed the Master of Arts (Telugu) Course Hall Ticket No. 717216015002 Examination held in May 2018.
He/She has been awarded the following Gold Medal (S) by this University at Second Convocation held on 7th November 2025.
1. "Late Sri Thirubaranga M Srinivasa Chary Memorial Gold Medal" Securing Highest Marks in the course - 2018
2. Sri A.Linga Reddy Gold Medal" Securing Highest Marks in the Paper "Vyakaranam-Bhasha Charitra" - 2018
Karimnagar
Dated 07-11-2025
Controller of Examination
OPPO A77s

తనకు వీరేశలింగం, గురజాడ అప్పారావు, శ్రీ శ్రీ, జాషువ వంటి మహనీయులు ఆదర్శమని, భవిష్యత్తులో స్త్రీ సాహిత్యం పై పరిశోధన చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఘనత సాధించినందుకు ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. జై కిషన్ ఓఝా, వైస్ ప్రిన్సిపల్ ఏ. సాంబశివరావు, స్టాఫ్ సెక్రటరీ డా. జీ. సుబ్బారావు, అధ్యాపక-అధ్యాపకేతర సిబ్బంది సమతకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.




# పచ్చదనమే ప్రగతి దారి

- **హరిత భవిష్యత్తు కోసం ఎన్‌టిపిసి రామగుండం కదిలింది!**
- **51వ రైజింగ్ డే సందర్భంగా మాస్ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్**

**పెద్దపల్లి,నవంబర్ 07(డీడీ9 వార్త):**

దేశానికి నమ్మకమైన విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా పచ్చదనాన్ని ప్రోత్సహించడం ఎన్‌టిపిసి లక్ష్యమని రామగుండం ఎన్‌టిపిసి యాజమాన్యం పేర్కొంది. సంస్థ స్థాపనకు 51 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రామగుండం ఎన్‌టిపిసి యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం మాస్ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ అండ్ టీ) చంద్రన్ కుమార్ సమంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత ప్రధాన అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని వెయ్యి మొక్కల నాటకం విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ, పచ్చని భవిష్యత్తు కోసం ఎన్‌టిపిసి నిరంతర కృషి చేస్తోంది. హరితాభివృద్ధి మన సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. ఎనర్జీ రంగంలో ప్రగతితో పాటు పర్యావరణ పరిరక్షణకూ సమాన ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఈ డ్రైవ్ ద్వారా ఎన్‌టిపిసి రామగుండం పర్యావరణ స్థిరత్వానికి తమ కట్టుబాటును మరోసారి ప్రతిబింబించిందని యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు, ఉద్యోగులు, మహిళా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై సబ్ కలెక్టర్ దృష్టి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, నవంబర్ 07(డీడీ9 వార్త ) :**

రెవెన్యూ సదస్సుల్లో అందిన సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన కోటగిరి, ఎడపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి, సాదాబైనామా ఫైళ్ల నిర్వహణపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. తనిఖీ అనంతరం సబ్ కలెక్టర్ ఉమ్మడి మండలాల రెవెన్యూ, జీపీవో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతిలో భాగంగా అందిన దరఖాస్తులన్నింటినీ రెవెన్యూ సిబ్బంది త్వరితగతిన పరిశీలించి, పూర్తి చేయాలని సూచించారు. అంగీకరించబడిన, తిరస్కరించబడిన దరఖాస్తులన్నింటికీ సంబంధించిన ఫైళ్లను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ ఫైళ్లను తహసీల్దార్ లాగిన్ నుంచి సబ్ కలెక్టర్ లాగిన్‌కు త్వరితంగా పంపించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ విభాగం పనితీరు మరింత వేగవంతం చేసి, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలి. ఎక్కడా జాప్యం జరగకుండా, ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ హుస్సేన్, ఆలియా బేగం, ఇతర రెవెన్యూ సిబ్బంది, జీపీవోలు తదితరులు పాల్గొన్నారు.



## రహదారి గుంతలను మట్టితో పూడ్చిన కుంజా సత్యవతి సేవా ఫౌండేషన్

- **మానవత్వంతో ముందడుగు వేసిన సేవ ఫౌండేషన్ సభ్యులు.**

**భద్రాచలం, నవంబర్ 7 (డిడి 9 వార్త)**

భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న భద్రాచల రహదారుల పూడ్చివేతకు కుంజా సత్యవతి సేవా ఫౌండేషన్ ముందడుగు వేశారు. పట్టణంలోని చర్ల రోడ్డులో గల కే కే ఫంక్షన్ హాల్, ఎపీఆర్ స్కూల్, నన్నపనేని స్కూల్ ఎదురుగా ఏర్పడిన గుంతలను ఫౌండేషన్ సభ్యులు ఈరోజు పూడ్చివేశారు.ఫౌండేషన్ ప్రతినిధి కుంజా సంతోష్ మాట్లాడుతూ ఇటీవల వర్షాలతో రహదారులు బాగా దెబ్బతిన్నాయని, ముఖ్యంగా రాజీపేట ప్రాంతంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాహిత దృక్పథంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. చిన్నచిన్న ప్రజా సేవా చర్యలను స్థానికులు స్వయంగా చేపడితే సమస్యలు కొంతవరకు తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కుంజా ధర్మా, పూనెం వీరభద్రం, చినబాబు దొర, బాచినేని రామకృష్ణ, వసుధ ఫౌండేషన్ శ్రీనివాస్ రాజు, ఆవుల సుబ్బారావు, స్టార్ ఫ్లెక్స్ కిరణ్, కృష్ణా శ్రీనివాస్ రావు, బైక్ మెకానిక్ యూనియన్ ప్రెసిడెంట్ భాను, డిపో నాగ, రవి, కుంజా అంజలి, దుర్గ, విజయ, వినోద్, వంశీ, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.







# ఘనంగా హాకీ శతాబ్ది ఉత్సవాలు

**పెద్దపల్లి,నవంబర్ 07(డీడీ9 వార్త):**

భారత జాతీయ హాకీ అసోసియేషన్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం దేశవ్యాప్తంగా శతాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామగిరి మండలం సెంటినరీ కాలనీ రాణి రుద్రమాదేవి క్రీడా మైదానంలో హాకీ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, ఐఎన్‌టియూసీ సెంట్రల్ సెక్రటరీ ఏ.రామారావు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...**

భారత జాతీయ క్రీడ హాకీ దేశ గౌరవ చిహ్నమని, ఒలింపిక్స్‌లో తొలి బంగారు పతకాలు అందించిన క్రీడ ఇదేనని గుర్తుచేశారు. హాకీ అసోసియేషన్ వందేళ్లుగా గ్రామగ్రామాన క్రీడాస్ఫూర్తిని వ్యాప్తి చేస్తూ, అట్టడుగున ఉన్న ప్రతిభావంతులను ప్రోత్సహించి దేశానికి అత్యుత్తమ క్రీడాకారులను అందించడం గర్వకారణమని పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పెద్దపల్లి హాకీ అసోసియేషన్ భాగస్వామ్యం కావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ముకేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ సలీం, సభ్యులు కె.ఎల్.ఎన్. ప్రసాద్, సదానందం, నరసింహారెడ్డి, శేషగిరి, నాగరాజు, ఆరిఫ్, చంద్రపాల్, రంజిత్, రాజ్ నిఖిల్, అడ్డూరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం గీతం దేశమాత ఆరాధనతో సమానం: డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్

- **ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలు**

**భద్రాచలం, నవంబర్ 07 ( డిడి9వార్త )**



భారత స్వాతంత్ర్య సమరంలో జాతిని జాగృతం చేసి, కోట్లాది మందిలో పోరాట స్ఫూర్తిని రగిలించిన 'వందేమాతరం' గీతం దేశమాత ఆరాధనతో సమానమని డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్ అన్నారు. ఈ గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు.

"వందేమాతరం గీతం దేశ స్వాతంత్ర సాధన సంకల్పానికి బలమైన ఊపిరిలా నిలిచింది. ప్రతి భారతీయుడి గుండెలోతుల్లోంచి వచ్చిన ఈ యుద్ధ నాదం బ్రిటిష్ పాలనకు నిద్రలేకుండా చేసింది. స్వరాజ్య సాధనకు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించిన తారక మంత్రం ఇది," అని అశోక్ ఉద్ఘాటించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మరియు సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అందుబాటులో లేనందున, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఐటీడీఏ ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, పరిపాలన అధికారి సున్నం రాంబాబు, ఇతర యూనిట్ అధికారులు, సిబ్బందితో కలిసి మూకుమ్మడిగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. వందేమాతరం గీతంలోని శబ్దం ప్రజల్లో ఆత్మవిశ్వాసం, ప్రేరణ నింపుతుందని, భవిష్యత్తుకు భరోసా కలిగిస్తుందని అశోక్ పేర్కొన్నారు. "ఈ గీతం ఒక సంకల్పం, ఒక మంత్రం, ఒక స్వప్నం, ఒకే లయ, ఒకే స్వరం భావంతో హృదయాన్ని స్పందింపజేస్తుంది," అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులను భయపెట్టి, జైళ్లపాలు చేసిన బ్రిటీషర్లకు 'వందేమాతరం' అనే మాటే భయపడేదని ఆయన గుర్తుచేశారు. కవి, రచయిత బంకించంద్ర చటర్జీ జాతికి అందించిన ఆ గేయంలోని శక్తి అనన్యమైనదని, దీనిని ఆలపించినా, విన్నా నర నరాన దేశభక్తి నిండుతుందని చెప్పారు. పోరాట స్ఫూర్తిని నింపిన ఈ గేయం గురించి భావితరాలకు ఘనంగా తెలియజేయాలని, భారత ప్రభుత్వం దీనిని జాతీయ గేయంగా అధికారికంగా ప్రకటించిందని తెలిపారు. నాటి నుండి అన్ని విద్యాసంస్థల్లోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ దీనిని ప్రారంభ గేయంగా నిర్వహించడం జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జి సి డి ఓ అలివేలు మంగతాయారు, జేడీఎం హరి కృష్ణ, మేనేజర్ ఆదినారాయణ మరియు ఇతర విభాగాల ఉద్యోగులు, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# లొంగిపోనున్న మరో ఏడుగురు మావోయిస్టులు

- **చత్తీస్ గడ్ లో మరో ఏడుగురు కీలక మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగుబాటు..**

**చర్ల, నవంబర్ 7 (డిడి 9 వార్త)**

చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్ గడ్ లో మావోయిస్టుల లొంగుబాటు కొనసాగుతోంది. గరియా బంద్ జిల్లాలో శుక్రవారం ఏడుగురు కీలక మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయేందుకు వనం నుంచి జనంలోకి వచ్చారు. ఉధంతి ఏరియా కమిటీ కమాండర్ సునీల్, కార్యదర్శి అరీనా వీరిలో ఉన్నారు. కమిటీ సభ్యులు లుద్రాన్, విద్య, నందిని, మల్లేష్ వీరితో కలిసి లొంగిపోయేందుకు వచ్చారు. వీరి వద్ద ఒక ఎస్ఎల్ఆర్, మూడు ఇన్సాస్ రైఫిల్స్, ఒక సింగిల్ షాట్ వెపన్ ఉన్నాయి. ఒకటి రెండు రోజుల్లో జిల్లా ఎస్పీ ముందు ఈ ఏడుగురు మావోయిస్టులు అధికారికంగా లొంగిపోనున్నారు.





# లోపించిన పారిశుధ్యం రోగాల బారిన జనం..

- మున్సిపల్ అధికారులుకు ప్రజల ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన..
- పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్న మణుగూరు బస్తి ...
- పట్టణ పరిశుభ్రత కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ అవి సక్రమంగా వినియోగించడంలేదని ఆరోపణలు.



**మణుగూరు , నవంబర్ 9, డి డి 9 వార్త ( ప్రతినిధి )**

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని అనేక , ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు చెత్త కుప్పలతో నిండిపోవడంతో పర్యావరణం దెబ్బతింటోంది. చెత్తను సకాలంలో సేకరించకపోవడంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం కారణంగా చెత్తలో నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత మణుగూరు వెళ్లే రహదారి, ఎస్బిఐ బ్యాంకు సందు, సురక్ష బస్టాండ్ పరిసరాల ప్రాంతాలు మార్కెట్ రోడ్ వంటి ప్రదేశాల్లో చెత్త కుప్పలు రోజురోజుకూ పెరుగుతున్నాయని నివాసితులు చెబుతున్నారు. ప్రతి ఇంటి ముందు చెత్త సేకరణ కోసం కూలీలు వస్తారని మున్సిపాలిటీ చెబుతున్నా, వాస్తవానికి వారాల తరబడి ఎవరూ రాకపోవడం వల్ల ప్రజలు తమ చెత్తను రోడ్ల పక్కన పడవేస్తున్నారు. ఫలితంగా అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి రహదారులపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

“మున్సిపల్ అధికారులు ప్రజల ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు. ఒక్కసారైనా ఫీల్డ్‌లోకి వచ్చి పరిస్థితిని చూసే ప్రయత్నం చేయడం లేదు” అని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. పట్టణ పరిశుభ్రత కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ అవి సక్రమంగా వినియోగించడంలేదని వారు ఆరోపిస్తున్నారు. చెత్త సేకరణ వాహనాలు తక్కువగా ఉండటం, కార్మికుల కొరత వంటి కారణాలను చూపుతూ అధికారులు బాధ్యత తప్పించుకోవడం ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తోంది. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్న ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ను కోరుతున్నారు. పట్టణాన్ని మళ్లీ పరిశుభ్రంగా, పచ్చగా మార్చేందుకు ప్రత్యేక పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి దుమ్ముగూడెం ఎస్ఐ గణేష్

**దుమ్ముగూడెం, నవంబర్ 07 (డిడి9 వార్త)**

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దుమ్ముగూడెం సబ్‌ఇన్‌స్పెక్టర్ గణేష్ సూచించారు. పెరుగుతున్న సైబర్ మోసాలపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఒన్‌టైమ్ పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ షేర్ చేయవద్దని ప్రజలను కోరారు. "బ్యాంకు అధికారులు, ఇతర ఆర్థిక సంస్థల సిబ్బంది ఎవ్వరూ కూడా ఫోన్ ద్వారా కానీ, ఇతర మార్గాల ద్వారా కానీ మీ ఓటీపీలను అడగరు," అని ఆయన స్పష్టం చేశారు. అలాగే, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లు, మెసేజ్‌లను నమ్మవద్దని, వాటిని ప్రెస్ చేయవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే, వెంటనే జాతీయ సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని ఎస్ఐ గణేష్ ప్రజలకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలకు సైబర్ నేరాల గురించి అనేక ముఖ్య విషయాలు తెలియజేశారు.






# దేశభక్తిని చాటిన పాలనా యంత్రాంగం

- కలెక్టరేట్, పోలీస్ సిబ్బంది సామూహిక గీతాలాపన

**నిజామాబాద్, నవంబర్ 06(డిడి9 వార్త) :**

మహాకవి బంకిం చంద్ర ఛటర్జీ రచించిన భారత జాతీయ గీతం ‘వందే మాతరం’ 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం ఘనంగా వేడుకలు జరిగాయి. కలెక్టరేట్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలలో అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు.

**కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యం**

జిల్లా కలెక్టరేట్‌లోని అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సామూహికంగా 'వందే మాతరం' గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో దీనికి విశేష ప్రాధాన్యత ఉందని అన్నారు. ఈ గీతాలాపనలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ సహా అన్ని శాఖల జిల్లా అధికారులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

**పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్ఫూర్తిదాయక వేడుక**

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య ఆధ్వర్యంలో 150 సంవత్సరాల వందేమాతరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ మొదట భారతమాత ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, బంకిం చంద్ర చట్టోపాధ్యాయ రచించిన ఈ గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ పదం ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తి జ్వాల రగిలించే శక్తిని కలిగి ఉందని, వందేమాతరం అని ఆలపించడం కేవలం ఒక గీతం పాడడం కాదని, అది మన తల్లి దేశానికి ఇచ్చే గౌరవప్రదమైన ప్రమాణం అని తెలియజేశారు. ఈ గీతం స్వాతంత్ర్య సమరయోధులకు ప్రేరణగా నిలిచినట్లే, నేటి తరం యువతకు దేశప్రేమ, కర్తవ్య నిష్ట, ఐక్యత అనే విలువలను స్ఫూర్తిగా అందిస్తుందని ఆయన చెప్పారు. ఈ వేడుకల్లో అదనపు డి.సి.పి (ఎ.ఆర్) రామ చందర్ రావ్, ఆఫీస్ సూపరింటెండెంట్లు, రిజర్వు ఇన్స్పెక్టర్స్, సి.సి.ఆర్.బి, కంట్రోల్ రూమ్, సెంట్రల్ కాంప్లైంటు సెల్, డి.పి.ఓ సిబ్బంది, హెడ్క్వార్టర్స్ సిబ్బంది, హోమ్ గార్డ్స్ పాల్గొన్నారు.



**సాలూరలో వందేమాతరం 150 వసంతాల ఉత్సవం**

భారత జాతీయ గీతం 'వందేమాతరం' రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం సాలూర మండల కేంద్రంలో ఉత్సవాలు ఘనంగా జరిపారు. తహశీల్దార్ కార్యాలయ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ, ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలల ఆవరణలలో ఉదయం 10 గంటలకు మండల స్థాయి అధికారులు, సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వారందరూ ఉద్వేగభరితంగా సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ... వందేమాతరం కేవలం ఒక పాట కాదని, ఇది మన మాతృభూమికి మనం ఇచ్చే గౌరవప్రదమైన ప్రమాణం అని పేర్కొన్నారు. ఈ గీతం స్వాతంత్ర్య సమరయోధులకు అందించిన ప్రేరణ, నేటి యువతలో దేశప్రేమ, కర్తవ్యనిష్ట, ఐక్యత అనే విలువలను పెంపొందించడంలోనూ ప్రముఖ పాత్ర వహిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శశిభూషణ్, పీఏసీఎస్ చైర్మన్ అల్లే జనార్దన్, ఇల్తెపు శంకర్, అల్లే రమేష్, ఇల్తెపు గంగారాం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొనున్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్ధం గ్రామ పంచాయతీకి బీరువా బహుకరణ

**బోనకల్,నవంబర్7(డిడి9 వార్త):**

మండల పరిధిలోని జానకిపురం గ్రామానికి చెందిన బొల్లెపోగు సురేష్‌నరేష్ అన్నదమ్ములు వారి తల్లిదండ్రులు బొల్లెపోగు రత్తయ్యమార్తమ్మల జ్ఞాపకార్థం గ్రామపంచాయతీకి బీరువా వితరణ చేయడం జరిగింది.తమ తల్లిదండ్రుల గౌరవార్థం గ్రామపంచాయతీకి బీరువా వితరణ చేయడం పట్ల పంచాయతీ సె



క్రెటరీ కన్నెపోగు శ్రీనివాసరావు,గ్రామ పెద్దలు చిలకా దాసు,బొమ్మనబోయిన చంద్రం,షేక్ మధార్ నాయకులు వారిని అభినందించారు.

# ఎలుగుబంటి దాడిలో జవాను కు తీవ్ర గాయాలు

**చర్ల, నవంబర్ 7 ( డిడి 9 వార్త)**

చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్ గడ్‌లోని బీజాపూర్ జిల్లాలో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్లో పాల్గొన్న ఓ జవాను పై ఎలుగుబంటి అకస్మాత్తుగా దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ఎలుగుబంటి దాడిలో గాయపడిన పోలీసు కానిస్టేబుల్ ను హెలికాప్టర్లో శుక్రవారం రాయ్‌పూర్‌కు తరలించారు . బీజాపూర్‌లో దట్టమైన అడవులు మరియు దుర్గమమైన కొండలతో చుట్టుముట్టబడిన కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గాయపడిన కానిస్టేబుల్‌ను వెట్టి కన్నగా గుర్తించారు, అతను ఆపరేషన్ బృందంతో కలిసి సెర్చ్ ఆపరేషన్‌లో ఉన్నప్పుడు అకస్మాత్తుగా పొదల నుండి ఒక ఎలుగుబంటి బయటకు వచ్చి అతనిపై దాడి చేసింది. దాడిలో జవాను కాలికి తీవ్ర గాయాలయ్యాయి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అతని తోటి కానిస్టేబుళ్లు వెంటనే బాధ్యత వహించి, ఎలుగుబంటిని తరిమివేసి, గాయపడిన కానిస్టేబుల్‌ను సురక్షితంగా తరలించారు. ఉన్నతాధికారులకు ఈ సంఘటన గురించి సమాచారం అందించారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుండి హెలికాప్టర్ను ఘటన స్థలానికి పంపించారు. గాయపడిన కానిస్టేబుల్‌ను బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స తర్వాత, వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని నిర్ధారించి, మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు రిఫర్ చేశారు. బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్, సుక్మా, దంతేవాడ, నారాయణపూర్, కొండగావ్, బస్తర్ మరియు కాంకేర్ అడవులలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాలలో కార్యక

# శాస్త్రీయ విద్య సాధన కోసం ఉద్యమిద్దాం..

- **పిడిఎస్యు జిల్లా కార్యదర్శి గణేష్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 7, డిడి9 వార్త**




నవంబర్ 5 నుండి 11 వరకు విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్.యూ) రాష్ట్ర కార్యవర్గ పిలుపులో భాగంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థి అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించడం జరిగింది. జిల్లా నాయకులు ఏ అరుణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి జె గణేష్ పాల్గొని మాట్లాడుతూ శాస్త్రీయ విద్యాసాధన కోసం, సమ సమాజ స్థాపన కోసం నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల ప్రేరణతో ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జిరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, స్నేహలత మధుసూదన్, వీరన్న లాంటి ఎందరో విద్యార్థి వీరులు సమాజం మార్పు కోసం దోపిడి పీడన లేని వ్యవస్థ కోసం ప్రతి ఒక్కరికి సమాన ఉచిత నాణ్యమైన విద్య అందాలని విద్యారంగ మౌలిక సమస్యలపై ఉద్యమిస్తూ పోరాడుతున్న కాలంలో సమయాన ఎమర్జెన్సీ కాలంలో బూటకపు ఎన్కౌంటర్లో శత్రువు దాడుల్లో విద్యార్థి వీరులు ఎంతోమంది అమరులయ్యారని, వారి ఆశయ సాధన కోసం మనం ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. నేటికీ సమాజంలో దోపిడీ, పీడనా, వివక్షత లు కొనసాగుతునే ఉన్నాయని, అవి నేటికీ మరింత ఎక్కువ అయ్యాయని వారి పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ పార్లమెంటరీ ఫాసింజం అమలుకు పూనుకున్నాది. ప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తున్నది. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న మేధావులను, ప్రజలను, విప్లవకారులను, తీవ్ర నిర్భధాలకు గురిచేస్తున్నారు. ఉద్యమకారులను అర్బన్ నక్సలైట్ల పేరుతో అణిచివేయ చూస్తున్నారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యకు మతం రంగును పులమాలని చూస్తున్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను పెంచి పోషించి విద్యను వ్యాపారీకరణ చేసి పేదవానికి నేడు విద్యను అందరిని ద్రాక్షగా మార్చారు. సెంట్రల్ యూనివర్సిటీలలో మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తున్నారు రాష్ట్ర యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు ప్రైవేటు యూనివర్సిటీలను తీసుకువచ్చి ఉన్నత విద్యను పేదవానికి మరింత దూరాన్ని చేస్తున్నారు. ఈ క్రమంలోనే అందరికీ ఉచిత, సమాన, నాణ్యమైన విద్య కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అసమానతలు లేని సమాజ నిర్మాణం కొరకు శాస్త్రీయ విద్య సాధన ద్యేయంగా, సమ సమాజ లక్ష్యంతో ముందుకు సాగాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవళిక పల్లవి చరణ్ పాల్గొన్నారు.





# సింగరేణి ఆబ్సెంట్ కౌన్సిలింగ్ నిర్ణయంపై హెచ్ఎంఎస్ ఆగ్రహం

- **భార్యా పిల్లల ముందు కార్మికులను అవమానపరచే విధానం – వెంటనే రద్దు చేయాలని డిమాండ్**
- **హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్**

**పెద్దపల్లి,నవంబర్ 07(డీడీ9 వార్త):**

సింగరేణి యాజమాన్యం ఆబ్సెంట్ కౌన్సిలింగ్ పేరిట కార్మికులను భార్య పిల్లల సమక్షంలో పిలవాలని నిర్ణయించడం తీవ్ర నిరసనకు గురవుతోంది. హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు రియాజ్ అహ్మద్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, దీన్ని "కార్మికుల గౌరవాన్ని తుంచే అవమానకర చర్యగా పేర్కొన్నారు. ఆబ్సెంట్ కౌన్సిలింగ్ పేరుతో ఉద్యోగులను కుటుంబ సభ్యులతో హాజరు కావాలని ఆదేశించడం, వారి పరువును తీసే చర్య అని విమర్శించారు. కార్మికుడు గనిలో శ్రమించి కుటుంబాన్ని పోషిస్తున్నాడు —— ఆ కుటుంబం ముందే అతన్ని ప్రశ్నించడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. రియాజ్ అహ్మద్ అన్నారు, ఈ విధానం పనిలేని అధికారులకు పని కల్పించడమే తప్ప, సమస్య పరిష్కారానికి కాదు. ఆబ్సెంట్ కౌన్సిలింగ్ అనేది జనవరి తర్వాత మాత్రమే, మాస్టర్లు తక్కువ ఉన్నవారికి నిర్వహించాలి. 240 మాస్టర్లు నిండిన కార్మికులను పిలవడం హాస్యాస్పదం. ఆబ్సెంట్ కౌన్సిలింగ్ కోసం కుటుంబ సభ్యులను పిలిచే ఏ జీవో లేదని, అలాంటి ఆదేశాలు ఉంటే చూపించాలని ఆయన యాజమాన్యానికి సవాల్ విసిరారు. గెలిచిన సంఘాల నాయకులు యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల హక్కులను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. కౌన్సిలింగ్ డ్యూటీ సమయంలోనే జరగాలి. డ్యూటీ తర్వాత పిలిచి అవమానపరిస్తే హెచ్ఎంఎస్ సహించదు అని హెచ్చరించారు. కార్మికులకు పిలుపునిస్తూ, ఆబ్సెంట్ కౌన్సిలింగ్‌కు భార్య పిల్లలతో వెళ్లవద్దు. మీ హక్కుల కోసం హెచ్ఎంఎస్ మీ వెనుక ఉంది అని స్పష్టం చేశారు. రియాజ్ అహ్మద్ యాజమాన్యానికి సూచిస్తూ, జనవరిలో మాస్టర్లు తక్కువ ఉన్నవారిని మాత్రమే కౌన్సిలింగ్‌కు పిలవండి, ఇప్పుడే నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులందరితో కలిసి తీవ్ర ఆందోళన చేపడతాం, అని హెచ్చరించారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం చేయి చేయి కలుపుదాం

- **ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పిలుపు**
- **చైతన్యం - గంజాయిపై యుద్ధం**
- **విద్యార్థులతో భారీ ప్రదర్శన**
- **అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం**
- **డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ**

**భద్రాచలం, నవంబర్ 07 (డిడి9 వార్త):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, 'చైతన్యండ్రగ్స్‌పై యుద్ధం' కార్యక్రమంలో భాగంగా భద్రాచలంలో డ్రగ్స్ వినియోగంపై భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యార్థులు ఈ చైతన్య ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, ప్రధాన రహదారి మీదుగా బస్టాండ్ వరకు సాగి, చివరకు అంబేద్కర్ సెంటర్ వద్ద ముగిసింది. వేలాది మంది విద్యార్థులు "చేయి చేయి కలుపుదాం... డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం", "మత్తు వద్దుమన జీవితం ముద్దు" అంటూ నినదించారు. ర్యాలీ ముగింపులో, అంబేద్కర్ సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించి, మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు.

**యువత, విద్యార్థులు బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోరాదు**

ఈసందర్భంగాఏఎస్పీవిక్రాంత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మత్తుకుబానిసలైతమబంగారుభవిష్యత్తును పాడు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. "నూరేళ్ల జీవితాన్ని మత్తులో ముంచి, కుటుంబాన్ని రోడ్డున పడేయకండి," అని ఆయన యువత విద్యార్థులకు పిలుపునిచ్చారు. "మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు సంఘటితంగాపోరాటంచేయాలి.భవిష్యత్ తరాలకు డ్రగ్స్ మహమ్మారి నుంచి విముక్తి కలిగించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది," అని ఏఎస్పీ స్పష్టం చేశారు. మత్తు పదార్థాలను వినియోగించడం, సరఫరా చేయడం చట్టరీత్యా నేరం అని హెచ్చరించారు. పౌరులు ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగాన్ని గమనిస్తే, వెంటనే తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఎం. నాగరాజు, ఎస్సైలు సతీష్, శ్యామ్, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి రావు, సీఆర్‌పీఎఫ్ 141 సిబ్బంది, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులకే కీలక స్థానం: ఆర్.ఎం. జ్యోత్స్న

**నిజామాబాద్, నవంబర్ 07(డీడీ9 వార్త ):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధి ప్రగతిలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని రీజినల్ మేనేజర్ జ్యోత్స్న స్పష్టం చేశారు. శుక్రవారం నిజామాబాద్ 1 డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.ఎం. జ్యోత్స్న ముఖ్య ప్రసంగం చేస్తూ... క్రమశిక్షణ, ప్రయాణికుల పట్ల సేవాభావం, సురక్షిత ప్రయాణాన్ని అందించడం... ఇవే ఆర్టీసీ సంస్థకు మూల బలాలు అని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగులకు అందించే ఈ అవార్డులు వారి నిరంతర కృషికి లభించిన గుర్తింపు మాత్రమే కాదని, డిపోలోని ఇతర సిబ్బందికి మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ప్రేరణగా నిలుస్తాయని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ సంస్థ లాభాల్లో భాగస్వాములై, దాని ప్రగతికి పాటుపడాలని ఆమె పిలుపునిచ్చారు. ఆయిల్ సేవింగ్ (ఇంధన ఆదా), డిపో ఆదాయ వృద్ధి మరియు సమయపాలనతో పాటు మెరుగైన ప్రయాణ సేవలు అందించడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు ఉద్యోగులను సత్కరించారు. డ్రైవర్లు, కండక్టర్లు, టైం డ్రైవర్లు, పీహెచ్‌బీ డ్రైవర్లు, టెక్నీషియన్లు, శ్రామికులకు ఆమె చేతుల మీదుగా సర్టిఫికెట్లు మరియు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, పీవో పద్మజతో పాటు రీజియన్ పరిధిలోని అన్ని డిపో మేనేజర్లు పాల్గొన్నారు.



# సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

- **టీచర్లకు హెల్త్ కార్డు ద్వారా ఉచిత వైద్యం అందించాలి**
- **ప్రధానోపాధ్యాయుల సమావేశాలు జిల్లా కేంద్రంలో నిర్వహించటం తగ్గించాలి**
- **కాంప్లెక్స్ సమావేశంలో టిఎస్ యూటిఎఫ్ బోనకల్**

**బోనకల్,నవంబర్7 (డిడి9 వార్త):**



తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టి ఎస్ యు టిఎఫ్ సంఘ నిర్మాణంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో మూడు కాంప్లెక్స్ కమిటీల ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖమ్మం జిల్లా కార్యదర్శి ఉగ్రత రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అసంబద్ధంగా ఉందని, వెంటనే సమీక్షించాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా 22 లక్షల టీచర్లు తెలంగాణ రాష్ట్రంలో 32,000 మంది టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారని, కావున కేంద్ర విద్యా శాఖ స్పందించి వెంటనే విద్యాహక్కు చట్టంలోని 23వ క్లాసుని మార్చి విద్యాహక్కు చట్టం అమలైన తేదీ నుంచే టెట్ వర్తించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్, ఆల్ ఇండియా సంఘం ఎస్ టి ఎఫ్ ఐ డిమాండ్ చేస్తుందని, ఆమేరకు ఎస్ టి ఎఫ్ ఐ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసిందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వెయ్యమని యుటిఎఫ్ గా డిమాండ్ చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం కూడా రివ్యూ పిటిషన్ వేయడం జరిగిందని తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను నాయకత్వం కలిసిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీకి మరియు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీకి ఇచ్చిన హామీ నిలబెట్టుకుని ఉద్యోగులకు హెల్త్ కార్డు పై ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు బకాయిపడిన డిఎ లను వెంటనే ఇవ్వాలని, పి ఆర్ సి నివేదికను వెలువరించి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి ఆమోదయోగ్యమైన పిఆర్సి వర్తింపజేయాలని మరియు రాష్ట్ర ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకొని సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు టైం టేబుల్ మార్పుతో పాటు కేర్ టేకర్ ను నియమించాలని, కేజీబీవీ,యు ఆర్ ఎస్ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇచ్చి సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ జీతాలు పెంచాలని, బేసిక్ ఇవ్వాలని, మోడల్ స్కూల్లో పనిచేస్తున్న టీచర్లకు 010 హెడ్ కింద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రధానోపాధ్యాయుల సమావేశాలను ఎక్కువ శాతం మండల కేంద్రాలలో ఏర్పాటు చేసే విధంగా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆన్లైన్లో సమావేశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు ,ఈకార్యక్రమంలో మండలం అధ్యక్షులు చిన్న రంగారావు,మండల ఉపాధ్యక్షులు పి గోపాలరావు,మండల కార్యదర్శులు పి.నరసింహారావు,బి.నిర్మల,చిట్యాల కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు యోహాన్,జానకీపురం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు,భాషాబ్రహ్మం,వెంకన్న,నరేంద్ర సింహ బానోత్ రమేష్,అరుణ కుమారి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

**కాంప్లెక్స్ కమిటీలు ఎన్నిక ఏకగ్రీవం**

బోనకల్ కాంప్లెక్స్ కమిటీ కన్వీనర్ గా రేఖం శ్రీను

కో కన్వీనర్ కే.పద్మావతి,

జానకిపురం కాంప్లెక్స్ కన్వీనర్ గా జి .శ్రీనివాసరావు

కో కన్వీనర్ గా గంగుల పావని

కలకోట కాంప్లెక్స్ కన్వీనర్ గా ఎం.లవకుశ కో కన్వీనర్ గా నసీమా సుల్తానాను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన వారికి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.



# పెంటకలాన్ లో అంగన్వాడీ భవనానికి భూమిపూజ

**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 07(డీడీ9 వార్త ) :**

బోధన్ మండలం పెంటాకలాన్ గ్రామంలో నూతన అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి శుక్రవారం స్థానిక నాయకులు, అధికారుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. ఈ నూతన భవనాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు గంగా శంకర్ మాట్లాడుతూ ... అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, శిశువుల ఆరోగ్యం, పోషణకు పునాదిగా నిలుస్తాయని తెలిపారు. మెరుగైన వసతులతో నూతన భవనం నిర్మించడం ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్య, పోషకాహారాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

# వన దేవతల సన్నిధిలో ఆదివాసి హిజ్రాల పై దాడి చేయడం సరైనది కాదు

- **ఆదివాసి యువశక్తి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు బడే సులోచన...**

**తాడ్వాయి ( నవంబర్ 07 డిడి 9 వార్త) :-**



మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధిలో గత రెండు రోజుల క్రితం కార్తీక పౌర్ణమి రోజున అమ్మవార్ల గద్దేల ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తుండగా భద్రాద్రి కోతగూడెం జిల్లా , ఇల్లందుకు చెందిన సారిక వారి బంధువులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నా అనంతరం సారిక అనే ట్రాన్స్ జెండర్ మేడారం లో ఆదివాసి బిడ్డలైన అర్ధ నారీశ్వరుల మధ్య వివాదం చెలరేగింది.

ఈ సందర్భంగా ఆదివాసి యువశక్తి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు బడే సులోచన మాట్లాడుతూ గుడి ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి రోజున దీపాలు వెలిగించే టప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి అని లేదంటే మంటలు ఎగిసిపడుతాయని పూజారులు చెప్పిన కూడ వారు వినకుండా వారి ఇష్టానుసారంగా చేసే సరికి దగ్గర్లో ఉన్న మేడారానికి చెందిన ట్రాన్స్ జెండర్స్ చెప్పిన కూడ వినకుండా ఆమెతో వచ్చిన భక్తులతో కలసి వారిపై దాడి చేసి వారిని విచక్షణ రహితంగా కొట్టడడం జరిగిందని అన్నారు. ఆదివాసి బిడ్డలపై దాడి చేయడం సరైన పద్ధతి కాదు అని , వారిని వదిలిపెట్టేది లేదని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసి యువశక్తి సంఘం సభ్యులు , ట్రాన్స్ జెండర్స్ పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతిలో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

**నిజామాబాద్ నవంబర్ 07(డీడీ9 వార్త ) :**

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లుల వద్ద జరుగుతున్న జాప్యం, నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతులు, నిర్వాహకుల ఫిర్యాదుల మేరకు ఆయన రాంపూర్ కొనుగోలు కేంద్రాన్ని, ఆర్.కె. రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మొదట డిచ్పల్లి మండలం రాంపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దొడ్డు రకం ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్ద రోజుల తరబడి దించుకోవడం లేదని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కేంద్రం నిర్వాహకులతో పాటు స్థానిక రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, ధాన్యాన్ని తరలించే ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్కు ఫోన్ చేసి, కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలను వెంటనే పంపాలని ఆదేశించారు. లేకపోతే కాంట్రాక్టును రద్దు చేస్తామని గట్టిగా హెచ్చరించారు. అక్కడి నుంచి నేరుగా ఖానాపూర్ శివారులోని ఆర్.కె. రైస్ మిల్లును తనిఖీ చేసిన కలెక్టర్, ధాన్యం దిగుమతి వివరాలపై ట్రక్ షీట్లను పరిశీలించారు. మిల్లు ఆవరణలో ఐదారు రోజులుగా ధాన్యం లోడ్లతో నిలిచి ఉన్న లారీలను గమనించిన కలెక్టర్, డ్రైవర్లను ప్రశ్నించారు. రోజుల తరబడి అన్లోడింగ్ చేసుకోకపోవడంపై మిల్లు నిర్వాహకులను నిలదీశారు. పదేపదే సూచిస్తున్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోకుండా వాహనాలను నిలిపి ఉంచితే, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంతేకాకుండా, ధాన్యం వర్షాల కారణంగా తడిసిపోయే ప్రమాదం కూడా ఉందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సమగ్ర పరిశీలన జరిపి, తనకు పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ తన వెంట ఉన్న డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డిలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# దేశభక్తిని చాటుతూ జాతీయ గీతం ఆలాపన

- **విద్యార్థులతో మానవహారం**

**దుమ్ముగూడెం, నవంబర్ 07 (డిడి9 వార్త)**



భారత స్వాతంత్ర్య సమరయోధులకు అపారమైన ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని నింపిన జాతీయ గీతం 'వందేమాతరం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు దుమ్ముగూడెంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని దుమ్ముగూడెం పట్టణంలో విద్యార్థులు, పోలీసులు ముఖ్య పాత్ర వహించారు. దేశభక్తిని ఇనుమడింపజేసే వాతావరణంలో సామూహికంగా జాతీయ గీతం 'వందేమాతరం'ను ఉత్తేజ భరితంగా ఆలపించారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని దేశమంతటా సంస్మరణోత్సవాలుగా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ గీతాలాపన కార్యక్రమం ద్వారా యువతలో, ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని మరింతగా పెంపొందించేందుకు కృషి చేశారు. భారతదేశ ఆత్మను ప్రతిబింబించే 'వందేమాతరం' గీతం ఆలపించిన సందర్భంగా, కార్యక్రమానికి హాజరైన వారందరూ దేశం పట్ల తమ నిబద్ధతను, గౌరవాన్ని చాటారు. భవిష్యత్ తరాలకు స్వాతంత్ర్య పోరాట విలువలను అందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో లో దుమ్ముగూడెం తహసిల్దార్ అశోక్ కుమార్, ఎంపిడిఓ రామకృష్ణ, ఎంఈవో, ఎస్సై గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతి నిలయంలో అన్నదానం

**బోనకల్,నవంబర్7,(డిడి9 వార్త):**

గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన రోళ్ళకంటి లెయాన్సిక సెసిరో మొదటి బర్త్ డే సందర్భంగా బోనకల్ మండల కేంద్రంలోని మానసిక వికలాంగుల శాంతి నిలయంలో అన్నవితరణ చేసిన గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన రోళ్లకంటి రమేష్‌సునీత దంపతులు శాంతి నిలయం సిస్టర్స్ లెయాన్సక సెసిరో ను ఆశీర్వదించి రమేష్‌సునీత దంపతులకు అభినందనలు తెలియజేశారు,ఇటువంటి మంచి కార్యక్రమాలను చేయాలని రోళ్ళకంటి రమేష్ సునీత దంపతుల కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు,ఈ కార్యక్రమంలో రోళ్ళ కంటి రమేష్‌సునీత కుటుంబ సమేతంగా బంధుమిత్రులు తో పాల్గొన్నారు.



## భద్రాద్రిలో దేశభక్తి పారవశ్యం

- **'వందేమాతరం' స్ఫూర్తితో పులకించిన భద్రాద్రి పుణ్యక్షేత్రం!**
- **వందేమాతరం గీతానికి 150 ఏళ్లు**
- **ఆలయం నుండి ఆసుపత్రి వరకు జాతీయ గీతాలాపన**

**భద్రాచలం, నవంబర్ 07 (డిడి9 వార్త)**

భారత స్వాతంత్ర్య సమరంలో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చిన అజరామర గీతం 'వందేమాతరం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, పవిత్ర భద్రాచలం పుణ్యక్షేత్రం నేడు దేశభక్తితో పులకించిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది భక్తి పారవశ్యంతో 'వందేమాతరం' గీతాన్ని ఆలపించారు. ఆలయ నాలుగో తరగతి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు, టీజీఎస్పీఎఫ్ సిబ్బంది సైతం ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దేశభక్తిని చాటుతూ వారు చేసిన గీతాలాపన, స్వామివారి సన్నిధిని మరింత ఆధ్యాత్మిక, జాతీయ వాతావరణంతో నింపింది. విద్యార్థులు, ఉద్యోగుల ఉత్సాహంగా భారత జాతీయ గీతంను ఘనంగా ఆలపించారు. కేవలం ఆలయ ప్రాంగణంలోనే



కాక, భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది, అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు ఈ జాతీయ ఐక్యతను పెంపొందించే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య కాంక్షకు ప్రతిరూపమైన ఈ గీతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలపించడం ద్వారా, జాతి పట్ల తమ గౌరవాన్ని, అంకితభావాన్ని చాటుకున్నారు. 'వందేమాతరం' స్ఫూర్తిని గుర్తుచేస్తూ, భద్రాచలంలో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

## గుండ్ల సింగారం గ్రామం ఎక్కడుంది?

- **భారీ యంత్రాలతో గోదావరి నీ తోడేస్తూ ఇసుక దోపిడీ..**
- **రేణుక అక్షరమండలి అధ్యక్షురాలు పూణేం సరోజ..**

**మణుగూరు, నవంబర్ 7, డిడి9 వార్త**

మణుగూరు మండల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతంలో గల గుండ్ల సింగారం ఇసుక ర్యాంపు నిర్వహణలో భారీ దోపిడీ జరుగుతుందని రేణుక అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పూనేం సరోజ ప్రకటనలో తెలిపారు. భారీ యంత్రాలతో అడ్డగోలుగా గోదావరి నదినీ తోడేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నారని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి మణుగూరు రెవిన్యూ పరిధిలో గుండ్ల సింగారం ఎక్కడ ఉందని ఆమె సూటిగా ప్రశ్నించారు.గుండ్ల సింగారం పేరుతో ఇసుక సొసైటీ లు చేసుకొని ఆదివాసీ సమాజాన్ని , ఏజన్సీ చట్టాలను మోసం చేస్తూ ఇసుక సొసైటీ లు ఎలా చేస్తున్నారని ప్రశ్నించింది. దీని వెనుక కుట్ర దారులు, సూత్ర దారులు, కర్త, కర్మ, క్రియ లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని ఆరోపించింది. ఈ ఇసుక ర్యాంపు పై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేయాలని ఆమె



డిమాండ్ చేశారు. గుండ్ల సింగారం అనే గ్రామం 20 సంవత్సరాల క్రితమే సింగరేణి ఓసి ల క్రింద తీసుకొని భూనిర్వాసితుల క్రింద ప్యాకేజీ కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. కానీ నేడు గుండ్ల సింగారం పేరుతో ఊరు లేని చోట ఊరి పేరు చెప్పుకొంటూ కొన్ని వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను దోపిడీ చేస్తూ భారీ యంత్రాలతో గోదావరి తల్లికి కడుపు కోత మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి టీజీఎండిసి ఏ రకంగా పర్మిషన్ ఇచ్చిందని ఆమె అన్నారు. 1996 అమైండ్మెంట్ యాక్ట్ 2011 పీసా" చట్టం ప్రకారంగా ఆ గ్రామాన్ని సందర్శించారా.! లేక ఆ ప్రాంతంలో పీసా గ్రామ సభ నిర్వహించారని ప్రశ్నించారు. ఇట్టి ఇసుక ర్యాంపు పై అధికారులు ఏ రకంగా గుడ్డిగా సంతకం పెట్టారని వాపోయారు. మైనింగ్ , డిఎల్ సి, ఎమ్మార్వో , ఇరిగేషన్ రకరకాల డిపార్ట్మెంట్ అధికారులు ఎలా సంతకాలు చేసి అనుమతులు ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ ఊరును మాకు చూపెట్టలని రేణుక అక్షర మహిళా మండలి వారు డిమాండ్ చేసారు. లేనిచో సర్వే భవన్ నుండి మ్యాప్ లు తెప్పించి అధికారుల పై హై కోర్టు లో కేసులు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ, సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఎండి షబానా, కోరి శ్యామల ,దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, కన్నాపురం శైలజ ,రెడ్డి బోయిన రేణుక, సౌజన్య డాకూరి,మరియు బాడిశ పార్వతి పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీ తో గెలిపించాలి

- **ఉపఎన్నికల ప్రచారంలో ఎన్ ఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు నవీన్**

**బోనకల్,నవంబరు7,(డిడి 9వార్త):**

అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న సేవా తత్పరుడు,నవీన్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ 126వ బూత్ నందు ఇంటింటి ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన్న సంక్షేమ పథకాలు,గురించి వివరిస్తూ అభివృద్ధి కావాలంటే అది కాంగ్రెస్ తోనే సాధ్యం అని జూబ్లిహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ ని అత్యధిక మెజారిటీ తో గెలిపించి శాసన సభ కు పంపించాలని నవీన్ అన్నారు.



## ఇసుక క్వారీల కోసం రగడ..!

- **రెండు సొసైటీ సభ్యుల మధ్య వైరం**
- **మంత్రి అండతో గుత్తేదారులు ఇష్టారాజ్యం**
- **గుత్తేదారుల కనుసన్నలతో ఒక సొసైటికే కొమ్ముకాస్తున్న అధికారులు**
- **న్యాయం చేయాలని కె.కొండాపురం గ్రామానికి చెందిన శ్రీ సీతారామ సొసైటీ సభ్యుల ఆందోళన**
- **కలెక్టరేట్ ఎదుట బైటాయించి నిరసన..**
- **జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి.. తగిన చర్యలు తీసుకుంటామని హామీ..**

**మణుగూరు, నవంబర్ 7, డిడి9 వార్త**





ఇసుక క్వారీల కోసం రగడ మొదలైంది. ఓ వర్గానికి గుత్తేదారులు వంతపాడుతూ.. అధికారులతో పావులు కదుపుతూ ఇసుక క్వారీని తమకు కాకుండా చేయాలని చూస్తూ గిరిజనుల ఆస్తిని కొల్లగొట్టాలని చూస్తున్నారని మరో వర్గం ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మణుగూరు మండలం కొత్తకొండాపురం గ్రామనికి చెందిన శ్రీ సీతారామ సొసైటీ సభ్యులు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ సొసైటీ అధ్యక్షురాలు లావణ్య మాట్లాడుతూ గుత్తేదారులు ఇచ్చే డబ్బులకు ఆశపడి అధికారులు తమకు అన్యాయం చేస్తున్నారని, సొసైటీ రిజిస్ట్రేషన్ మా సొసైటికి చేసి ఆరు నెలలు అవుతున్నా ఇసుక క్వారీని కేటాయించకుండా రెండు వారాల కిందట అక్రమ మార్గంలో సరైన పత్రాలు లేకుండా రిజిస్ట్రే



షన్ చేసుకున్న సొసైటికి కేటాయింపులు చేశారని ఆరోపించారు. మా సంఘం పై ఉద్దేశపూర్వకంగా లేనిపోని అభాండాలు వేస్తూ ఎంక్వైరీల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని, మా సొసైటికి అన్ని అర్హతలు ఉన్నా గుత్తేదారుల కనుసన్నల్లో అధికారులు పనిచేస్తూ మాకు తీరని అన్యాయం చేస్తున్నారని, సొసైటీకి రాజీనామా చేసిన అన్ని పత్రాలు ఉన్నప్పటికీ రెండు సంఘాలలో కొనసాగుతున్నామని తప్పుడు పత్రాలు ద్వారా ఇసుక క్వారీ మాకు కాకుండా చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ ముత్యాలమ్మ ఇసుక క్వారీ పాలక వర్గం రిజిస్ట్రేషన్ లో కొత్త కొండాపురం తో పాటు అన్నారం గ్రామాల పేరుతో చేశారని, కానీ రెవెన్యూ పంచాయతీలు వేరని, కానీ అధికారులు గుత్తేదారుల డబ్బులకు లొంగి కె.కొండాపురం గ్రామానికి చెందిన మాకు కాదని ఇతర గ్రామాలకు, ప్రభుత్వం ఉద్యోగం ఉన్న వారు సభ్యులుగా చేసి రిజిస్ట్రేషన్ చేశారని, ఎంక్వైరీ ఆఫీసర్ స్వప్న ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమకు అన్యాయం చేస్తోందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటనర్సమ్మ, జయలక్ష్మి, భారతి, నాగలక్ష్మి, యర్రమ్మ, నర్సమ్మ, వెంకటరమణ, భద్రమ్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు తథ్యం

- **తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్....**

**తాడ్వాయి (నవంబర్ 07 డిడి 9 వార్త);-**

రాష్ట్ర పంచాయితి రాజ్ గ్రామీణాభివృద్ధి , నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రీ వర్యులు సీతక్క గారితో గారితో , తాడ్వాయి మండల అధ్యక్షులు దేవేందర్ ముదిరాజ్ ఆద్వర్యంలో బోరబండ లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు..... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11న జారగబోయే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం చేస్తున్నామని తెలిపారు.

నవీన్ యాదవ్ గారు ఏ గల్లికి వెళ్లిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ బ్రహ్మరథం పడుతున్నారు అని , వారు అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అర్రేం లచ్చు పటేల్,ఉపాధ్యక్షలు ఇప్ప నాగేశ్వర్రావు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ముజాఫర్ హుస్సేన్, యూత్ అధ్యక్షులు కోడి సతీష్ కుమార్, మాజీ సర్పంచులు మంకిడి నర్సింహా స్వామి ,బెజ్జురి శ్రీనివాస్, ఇర్సవడ్ల నారాయణ, సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మల్లూరు ఆలయ కమిటీ డైరెక్టర్ పల్నాటి సత్యం, బీసీ సెల్ మండల అధ్యక్షులు , సింగిల్ విండో డైరెక్టర్ యాశడపు మల్లయ్య, యానాల సిద్ది రెడ్డి, దాయ వెంకన్న, శివానంద్, సాంబశివరావు, యువజన నాయకులు గంటసాయి రెడ్డి, జంపన్న,మర్రి నరేష్ గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోలు సంజీవ రెడ్డి , తదితరులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితర నాయకులు పాల్గొన్నారు.





# రోడ్లు పై గుంతలకు మరమ్మత్తులు వెంటనే చేయాలి

- **రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి**
- **బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన**

**కరకగూడెం, నవంబర్ 7 డి. డీ 9. వార్త**

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కొండంత దూరందని,ప్రజలతో చెలగాటం ఆడుతున్నారని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావుల సోమయ్య అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,పినపాక మాజీ ఎమ్మెల్యే శ్రీ రేగా కాంతారావు గారి ఆదేశాల మేరకు కరకగూడెం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డిజిటల్ క్యాంపెనింగ్ కార్యక్రమంలో భాగంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన,ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య రావుల సోమయ్య మాట్లాడుతూ...బయ్యారం(కరకగూడెం)తాడ్వాయి ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తుందని,రోడ్లు మరమ్మత్తులు చేయకుంటే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆక్షేపించారు.జిల్లా మంత్రులు వెంటనే స్పందించి డిఎంఎఫ్టి,సిఎస్ఆర్ నిధుల నుండి రోడ్ల పై ఏర్పడిన గుంతలను మరమ్మత్తులు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేశారు.రోడ్లు మరమ్మత్తులు చేయకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమరం రాంబాబు,అక్కిరెడ్డి వెంకటరెడ్డి,రేగా సత్యనారాయణ,బైరిశెట్టి చిరంజీవి,పోగు వెంకటేశ్వర్లు,బుడగం రాము,గుడ్ల రంజిత్,అత్తె సత్యనారాయణ,నిట్టా ఏడుకొండలు,మాజీ సర్పంచులు:ఊకె రామనాథం,పాయం నరసింహారావు,కొమరం విశ్వనాథం,కొమరం శ్రీను,భూక్య అర్జున్, గొగ్గల నారాయణ,నిట్టా ఏడుకొండలు,పోగు ఎల్లగౌడ్,పఠాన్ యాకుబ్ ఖాన్,ఈసం సమ్మయ్య,పులి శ్రీధర్,గుమ్మడివెల్లి ప్రసాద్,ఓర్సు భాస్కర్,యలగొండ శ్రీను,తోలెం రామారావు,మలకం వెంకటేశ్వర్లు,గుర్రం లాలు,సోషల్ మీడియా మండల అధ్యక్షులు సిద్ధి సునీల్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సహకార బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 07(డీడీ9 వార్త):**

ప్రజల ఆర్థికాభివృద్ధికి, పొదుపు అలవాట్లను పెంపొందించడానికి సహకార బ్యాంక్ అందిస్తున్న అమూల్యమైన సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్ లక్ష్మీ అన్నారు. సాలూర మండలం సాలంపాడ్ గ్రామ వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార బ్యాంక్ సామాన్య ప్రజలు, రైతులకు ఆర్థిక భారం తగ్గించే ఉద్దేశ్యంతో ముఖ్యంగా వ్యవసాయ,బంగారు,మరియు గృహ రుణాలను మార్కెట్‌లోని ఇతర బ్యాంకుల కంటే తక్కువ వడ్డీ రేట్లకు అందిస్తోందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు తమ అవసరాల కోసం, కలల ఇంటి నిర్మాణం కోసం ఈ తక్కువ వడ్డీ రుణాలను ఉపయోగించుకోవచ్చని సూచించారు. పొదుపు చేసేవారికి అధిక ప్రయోజనం చేకూర్చేందుకు కొత్తగా రెండు డిపాజిట్ పథకాలను ప్రవేశపెట్టినట్లు మేనేజర్ తెలిపారు.కొత్తగా ప్రారంభించిన 'కామధేను డిపాజిట్' పథకంపై అత్యధిక వడ్డీ రేటును అందిస్తున్నామని, ఇది దీర్ఘకాలిక పొదుపుదారులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని వివరించారు. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోపరేట్ నెలవారి రికరింగ్ డిపాజిట్ పథకంపై కూడా అత్యధిక వడ్డీ లభిస్తుందని వెల్లడించారు. ఈ డిపాజిట్ పథకాలు ప్రజలకు సురక్షితమైన, అత్యధిక రాబడినిచ్చే పెట్టుబడి మార్గాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కొత్త పథకాల్లో చేరి ఆర్థికంగా స్థిరపడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి నరేష్, సహకార సంఘం అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి,రైతులు పాల్గొన్నారు





# ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి : బీడీఎస్ఎఫ్ డిమాండ్

**నిజామాబాద్, నవంబర్07(డీడీ9 వార్త) :**

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజులను రాష్ట్రప్రభుత్వం కేవలం రూ. 125గా నిర్దేశించినప్పటికీ, జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు తమ ఇష్టారీతిన ఒక్కో విద్యార్థి నుండి వెయ్యి నుండి రెండు వేల వరకు అధికంగా వసూలు చేస్తున్నాయని బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు తల్లారే సంజయ్ ఆరోపించారు. బీడీఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రత్యేక తరగతుల పేరిట ఫీజుల దోపిడీకి పాల్పడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో మొత్తం 233 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని స్థానిక విద్యాశాఖ అధికారులు ఈ అధిక ఫీజుల వసూళ్లను చూసీ చూడనట్లుగా వ్యవహరించడం సరికాదని ప్రశ్నించారు. అధిక ఫీజులు ప్రశ్నిస్తే తమ పిల్లలకు పరీక్షల్లో ఇబ్బందులు పెడతారేమోనన్న భయంతోనే తల్లిదండ్రులు అడిగినంత ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సంజయ్ తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, వారి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల జిల్లా మండల కేంద్రాల్లోని ఆయా పాఠశాలల ముందు ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, లాలు, నరేందర్, ప్రియా, రోజా, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతర గీతం..

**మణుగూరు, నవంబర్ 7 డి డి 9 వార్త (ప్రతినిధి)**

జాతీయ గీతం వందేమాతరానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా "వందేమాతరం" జాతీయ గేయాన్ని సామూహికంగా ఆలపించే కార్యక్రమం మణుగూరు లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు.. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి నవీన్, మణుగూరు తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పల్నాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.